ప్రమాదకరంగా బుడమేరు ప్రవాహం

- పుట్టగుంట వంతెనను ఆనుకుని ప్రవాహం
- కోతకు గురైన రోడ్డు
- భయాందోళనల్లో ప్రయాణికులు
- ఆందోళనలో రైతన్నలు
- బెంబేలెత్తుతున్న పరివాహక ప్రాంత ప్రజలు



పుట్టగుంట వంతెన వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న బుడమేరు



పుట్టగుంట వంతెన వద్ద కోతకు గురైన ఎంఎన్‌కే రోడ్డు

గుడివాడరూరల్: బుడమేరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి నీరు ఉధృతంగా వస్తుండటంతో రోజురోజుకీ బుడమేరు ప్రవాహం పెరుగుతోంది. పుట్టగుంట వంతెన వద్ద నీటి ప్రవాహం 17.5 అడుగులకు చేరింది. నీటి ప్రవాహం 20.5 అడుగులకు చేరి వంతెనపై నీటి ప్రవాహం ప్రవహిస్తే ఎంఎన్‌కే రహదారిపై రాకపోకలను నిలిపివేసే అవకాశం ఉంది. ఇప్పటికే ఎగువ నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండటంతో ప్రవాహం మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.

రైతుల్లో దిగులు

ఇప్పటికే పుట్టగుంట, అరిపిరాల, పెదలింగాల, చినలింగాల, రామాపురం, కుదరవల్లి, ఒద్దులమెరక, చేదుర్తిపాడు, ఇలపర్రు గ్రామాల పరిధిలో బుడమేరు పరీవాహక ప్రాంతంలో దాదాపు ఆరు వేల ఎకరాల వరకు ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేశారు. ప్రస్తుతం వరి పంటకు రెండు విడతలు ఎరువులు పిచికారీ చేసి ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వరద ప్రవాహం పెరుగుతుండటంతో రైతులు పంటలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పంట చేతికి అందే అవకాశం ఉండదనే భయంతో పొలాల్లో చేరిన నీటిని బయటకు తరలించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గత ఏడాది ఇదే సీజన్‌లో బుడమేరు ఉగ్రరూపం దెబ్బకు చేతికి అందివచ్చిన పంట పూర్తిగా నీటి పాలై రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మరోమారు బుడమేరు ఉగ్రరూపం దాల్చుతుండటంతో ఈ ఏడాది అయినా పంట చేతికి వచ్చేనా అనే అనుమానంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు.

గతాన్ని తలుచుకుని

బుడమేరు ఉగ్రరూపం దాల్చుతుండటంతో పరివాహక ప్రాంత గ్రామాల వాసులు బెంబేలెత్తుతున్నారు. ఏడాది గడవకుండానే మరోమారు బుడమేరుకు వర్షాల రూపంలో ఎగువ నుంచి వరద నీరు భారీగా వస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళనలో ఉన్నారు. బుడమేరు గతంలో ఉగ్రరూపం దెబ్బకు గ్రామ గ్రామాలు ముంపు బారిన పడి నెలల తరబడి ప్రజలు గృహాలను వదిలి పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. ఆ వరదల దెబ్బకు ఆస్తి నష్టం సంభవించి ప్రజలు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. మరోమారు అదే విధంగా బుడమేరు ప్రవహిస్తుండంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కోతకు గురైన రోడ్డు

పుట్టగుంట వంతెనకు సమీపంలో నీటి ప్రవాహం ధాటికి ఎంఎన్‌కే రోడ్డు కోతకు గురైంది. సగం మేర రోడ్డు పూర్తి ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. రోడ్డు వెంబడి భారీ వాహనాలు ప్రతినిత్యం తిరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందంటున్నారు. రోడ్డు కోతకు గురైనా ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇలాగే వదిలేస్తే భారీగా వస్తున్న నీటి ప్రవాహానికి రోడ్డు మరింతగా కోతకు గురై ప్రయాణాలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతకు గురైన రోడ్డు వద్ద మరింత కోతకు గురవకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న వరి పొలాలు



సోమవరప్పాడులో వరి పంట పొలాల్లో చేరిన నీరు

సోమవరప్పాడు(పెదపారుపూడి): మండలంలోని వింజరంపాడు, మోపర్రు, సోమ వరప్పాడు గ్రా మాల్లోని వరి పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వన్నేరు డ్రెయిన్, ముస్తాదాబాద్ డ్రెయిన్ నుంచి వర్షపునీరు చేరటంతో పొలాలు చేరువుల్లా కనిపిస్తున్నాయి. కళ్ల ముందే వరి పంట పొలాలు రెండవ సారి నీట మునిగిపోవటంతో తీవ్ర నష్టం వస్తుందని మో పర్రు గ్రామానికి చెందిన రైతు బోయిన శివయ్య ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పంటకు ఎరువులు వేయటంతో ఏపుగా పెరిగి పచ్చగా ఉందని, ఈసమయంలో వరదల రూపంలో పంట అంతా నీట మునిగిపోవటంతో చాలా నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

ఇళ్లలోకి చేరిన వరద నీరు

మండలంలోని మోపర్రు గ్రామం ట్యాంక్ ఏరియాలో ఇళ్లలోకి నీరు చేరింది. అర్ధరాత్రి ఇళ్లలోకి నీటితోపాటు పాములు కూడా ఇళ్లలోకి చేరుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇళ్లలోకి నీరు, పాములు చేరటంతో భయాందోళనకు గురైనట్టు నక్క నాంచారమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. మోపర్రులో పరిస్థితిని తెలుసుకున్న అధికారులు ట్యాంక్ ఏరియా ప్రాంతాన్ని పరిశీలించారు. వృద్ధురాలు నక్క నాంచారమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ ఇంజిన్ పెట్టి నీటిని తోడించామని ఎంపీడీవో విమాదేవి తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనునాయక్, ఈవోపీఆర్డీ వి.శ్రీనివాసరావుతదితరులు పాల్గొన్నారు.

నైతిక విజయం వైఎస్సార్ సీపీదే

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



చిలకలపూడి(మచిలీపట్నం): పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో నైతికంగా వైఎస్సార్ సీపీ విజయం సాధించినట్లు అవుతుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి గురువారం విడుదలైన కౌంటింగ్ వివరాలు పరిశీలిస్తే టీడీపీ నాయకులు చేసిన అరాచకాలన్నీ బయటపడ్డాయన్నారు. బయట నుంచి వచ్చిన టీడీపీ నాయకులు ఏ విధంగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారో తేటతెల్లమైందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వైఎస్ కుటుంబాన్ని ఆరాధించే పులివెందులలో అధికార పార్టీ నాయకులు అరాచకాలు సృష్టించి దొంగ ఓట్లతో కూటమి ప్రభుత్వం రిగ్గింగ్‌కు పాల్పడి సాధించిన విజయం ఒక విజయమేనా అని ప్రశ్నించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా చూడాలని హై కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కూటమి ప్రభుత్వం అరాచకాలు సృష్టించి ఇష్టారాజ్యంగా ఎన్నికలునిర్వహించారన్నారు. కూటమి అరాచకాలను వీడియోల రూపంలో ఎన్నికలకు కమిషన్‌కు తాము పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అధికార పార్టీకి కొమ్ము కాశారన్నారు. అక్రమాలను ఆధారాలతో చూపిస్తూ సమాధానం చెప్పాలని మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సవాలు విసిరారన్నారు. పోలింగ్‌బూత్‌లలో ఏజెంట్లు లేకుండా తరిమేసిన ఎన్నికలు ఓ ఎన్నికలేనా అని అన్నారు. కూటమి నాయకులను పోలీసులు చోద్యం చూస్తూ కూర్చున్నారే తప్ప ఓటర్లను నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోలేదన్నారు. ఎలక్షన్ కమిషన్‌కు చిత్తశుద్ధి ఉంటే పోలింగ్ సరళి సీసీ ఫుటేజీలు బయటపెట్టాలన్నారు. ఎన్నికల ప్రక్రియను,ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కూటమి నాయకులకు త్వరలోనే రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ



రామస్వామిని పరామర్శిస్తున్న దూలం వినయకుమార్

ముదినేపల్లి రూరల్: పెనుమల్లి శివారు శింగవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాంబాబు తల్లి నాంచారమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నియోజకవర్గ నాయకుడు దూలం ఆదివినయ్‌కుమార్ గురువారం నివాళులర్పించారు. నాంచారమ్మ ఇటీవల మృతి చెందగా గురువారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు ముత్యాల రామస్వామి అనారోగ్యానికి గురికాగా వినయ్ పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు వీరమల్లు కొండలరావు, పార్టీ నాయకులు మోట్రు ఏసుబాబు, రాచూరి కుమార్, మీసాల రామకృష్ణ, ముత్యాల రాంబాబు, ఫిర్దోస్‌ఖాన్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

సచివాలయ భవనాన్ని మళ్లీ ప్రారంభిస్తారా?



మాజీ ఎమ్మెల్యే కైలే ప్రారంభించిన శిలాఫలకాన్ని చూపిస్తున్న జూపల్లి వెంకట్రావు

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రులో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ప్రారంభించిన సచివాలయాన్ని మరలా ఏలా ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ నేత జూపల్లి వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మోపర్రు సచివాలయం వద్ద ఆయన గురువారం మాట్లాడుతూ గ్రామంలో గత ప్రభుత్వంలో గ్రామంలోని సచివాలయాన్ని ఉపాధి నిధులు రూ.43.60 లక్షలతో నిర్మించారు. 2023 అక్టోబర్ 10న అప్పటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రారంభించారు. చిన్నచిన్న పనులు ఉంటే గ్రామస్తుడు, హైదరబాద్‌లో ఉంటున్న అడ్వకేట్ సీతంరాజు రామారావు సుమారు రూ.3 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. దీంతో ఈనెల 15న సీతంరాజు రామారావు చేత సచివాలయంలోకి ప్రవేశం చేద్దామని గ్రామస్తులందరం అనుకున్నాం. అయితే అధికార పార్టీకి చెందిన నేతలు వేరే వారి పేర్లు వేసి 18న ప్రారంభించాలని చూస్తున్నారని దీనిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు.

సమాచారం లేకుండా రైల్వే గేటు మూసివేత



గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు రైల్వే గేటును ముందస్తు సమాచారం లేకుండా మూసివేయడంతో వాహన చోదకులు అగచాట్లు పడ్డారు. గురువారం గేటు రిపేర్ల నిమిత్తం మూసివేశారు. దీంతో గుడ్లవల్లేరు, గుడివాడ రావలసిన ప్రయాణికులు నిడుమోలు, పామర్రు మండలం జుజ్జువరం మీదుగా తిరిగి రావలసివస్తోంది. గేటు మూసివేస్తున్నట్టుగా ముందుగా సమాచారం లేకపోవటంతో ప్రయాణికులు గేటు వరకు వచ్చి అధికారుల తీరును విమర్శిస్తూ తిరిగి వెళ్లిపోతున్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్స్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవి, అధ్యాపకులు కేఆర్ మంజుల, డాక్టర్ ఎం.అనిల్, డాక్టర్ పి.శ్రీకాంత్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయాల పునర్నిర్మాణానికి వితరణ

గుడ్లవల్లేరు: స్థానిక రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపుర పునర్నిర్మాణ, అభివృద్ధి, స్థానిక శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులకు దాతల నుంచి గురువారం విరాళాలు వెల్లువెత్తాయి. గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు దాతలు అందించారు. దాతలు విజయవాడకు చెందిన అన్నే తారక రామారావు మనవడు వేణు రూ.10 వేలు, కాకాని ఆదిలక్ష్మి స్మారకార్థం ఆమె భర్త జగన్మోహనరావు రూ.10 వేలు, కాకాని వెంకట్రావమ్మ జ్ఞాపకార్థం భర్త కాకాని కృష్ణారావు, కుమారుడు కాకాని రాము, కుమార్తె మండవ లక్ష్మి రూ.25 వేలను అందించారు. ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, సభ్యులు వల్లభనేని బుడ్డిబాబు, పోలవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత భీమేశ్వర స్వామి దేవస్థానం రాజగోపురం నిర్మాణానికి భక్తులు వితరణ అందజేసినట్లు ఆలయ ఈఓ కె.వేణుగోపాలరావు గురువారం తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రాజగోపురం 5వ అంతస్తు నిర్మాణానికి పట్టణానికి చెందిన ఎస్.గోపీచంద్- సుమతి దంపతులు రూ.10,016 అందజేసినట్లు ఆయన తెలిపారు.

గుడివాడ కోర్టుకు వంశీ



గుడివాడ టౌన్: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గురువారం గుడివాడ కోర్టులో హాజరయ్యారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుకు సంబంధించి ఆయన గన్నవరం కోర్టులో హాజరుకావలసి ఉంది. గన్నవరం కోర్టు సెలవు కారణంగా గుడివాడ కోర్టులో హాజరయ్యారు. వంశీ వెంట వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, సీనియర్ నాయకులు పాలేటి చంటి, నాయకులు మొండ్రు వెంకటేశ్వరరావు, అద్దేపల్లి పురుషోత్తం తదితరులు ఉన్నారు.

క్రమబద్ధీకరణ గడువు పెంపు

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం పొడిగిస్తూ జీఓ ఎంఎస్ నంబర్ 134/2025 జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 డిసెంబర్ 31లోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోలేని యజమానులకు ప్రయోజనం కల్పించేందుకు ఈ జీఓ విడుదల చేశారన్నారు. అనధికార లే అవుట్లలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లను ప్రణాళికాబద్ధంగా క్రమబద్ధీకరించడానికి ఈ పథకం కొనసాగుతుందన్నారు. గుర్తింపు పొందిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ద్వారా కానీ, స్వయంగా కాని యజమానులు అపరాధ రుసుముతో రూ.10 వేలు తగ్గకుండా 50 శాతం మించకుండా నోటీసు ఇచ్చిన రోజు నుంచి 90 రోజుల లోపు యజమానులు తమ హక్కు పత్రాలను ప్లాన్‌తో ఆన్‌లైన్ చేసుకోవలసిందిగా మున్సిపల్ కమిషనర్ కోరారు.

చెరువులా అండర్‌పాస్



పమిడిముక్కల: విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై గురజాడ వద్ద నున్న అండర్‌పాస్ చెరువులా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అండర్‌పాస్ అంతా నీరు చేరింది. నీరు పోయే మార్గం లేకపోవడంతో అక్కడే నిలిచిపోయింది. రాకపోకలు సాగక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అండర్‌పాస్ వద్ద నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారీ వర్షం

కైకలూరు: బంగాళాఖాతంలో అల్పపీడనంతో కైకలూరు నియోజకవర్గంలో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. గురువారం ఉదయానికి ముదినేపల్లి మండలంలో 45.6, కైకలూరు మండలంలో 41.2, మండవల్లి మండలంలో 37.8, కలిదిండి మండలంలో 36.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కైకలూరులో టౌన్ హాల్, బస్టాండ్ సెంటర్, వెలంపేట కాలనీలో వర్షపు నీరు చేరింది. కైకలూరు డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉండటంతో పలు చోట్ల పొంగి రోడ్లపైకి చేరాయి. పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేశారు. వాతావరణ నిపుణులు మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

రేషన్ బియ్యంలో పురుగులు



పెదపూడి(మొవ్వ): ప్రభుత్వ రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసిన బియ్యంలో పురుగులు రావటంతో కార్డుదారులు అవాక్కయ్యారు. మొవ్వ మండలం పెదపూడిలో 12వ నంబరు రేషన్ షాపులో ఈ నెలలో పంపిణీ చేసిన బియ్యంలో ముక్కపురుగులు పెద్ద ఎత్తున ఉండటం గమనార్హం. ఉచితంగా ఇచ్చే బియ్యమే కదా అని పురుగులు పట్టిన బియ్యం పంపిణీ చేస్తారా అని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉచితం బియ్యం పంపిణీపై అధికారులు పర్యవేక్షించి నాణ్యమైన బియ్యం అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

● మానసిక ఆరోగ్యంపై అవగాహన

గుడ్లవల్లేరు: మానసిక ఆరోగ్యంతో మనిషికి కాంతివంతమైన జీవకళ ఏర్పడుతుందని జీవన కళ నైపుణ్య శిక్షకులు దండు శ్రీనివాసరాజు అన్నారు. గురువారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు 'మానసిక ఆరోగ్యం- పోషణకు జీవన కళ ఆవశ్యకత' అను అంశంపై అవగాహనను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాసరాజు జీవిత కళయే జీవన కళ అన్నారు. దీనిలో జీవితాన్ని ఎలా జీవించాలి, ఎలా ఆస్వాదించాలి, ఎలా అభివృద్ధి పొందాలి అనే విషయాలపై ఒక నిర్దిష్టమైన ఆలోచన లేదా భావన కలిగి ఉంటుందన్నారు. అనంతరం ఆయన్ను కాలేజీ యాజమాన్యం సన్మానించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, డైరెక్టర్ ఏ.ఎస్.అండ్ ఎ.డాక్టర్ ఎం.కామరాజు, డైరెక్టర్ డాక్టర్ పి.సిద్దయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్. శాస్త్రి, ఎస్.ఐ.పి.కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎల్.ఆర్.శ్రీనివాస్, డాక్టర్ ఎస్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

పమిడిముక్కల: మేడూరు పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. చైర్‌పర్సన్ గోపిశెట్టి మోహనరావు, సభ్యులుగా తలకటూరి అంజమ్మ, వీరంకి శివవెంకటదాస్‌ల చేత సంఘ సీఈఓ తెల్లాకుల సీతారామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఉదయ్‌కుమార్, ఏపీ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, గ్రామ పెద్దలు అభినందించారు.

● పాడి రైతుకు సాయం

పామర్రు(మొవ్వ): పామర్రు పాల కేంద్రంలో పాలు పోస్తూ ఇటీవల మృతి చెందిన ఆరేపల్లి వెంకట కృష్ణారావు కుటుంబ సభ్యులకు క్షీరబంధు పథకం కింద రూ.50 వేల విలువైన చెక్కుని అందజేశారు. గురువారం జిల్లా ట్రస్ట్ బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి చేతుల మీదుగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పామర్రు చిల్లింగ్ సెంటర్ మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్, వేతన కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

● కూచిపూడిలో శీతల యంత్ర ప్రతిష్ఠ

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి అగ్రహార గ్రామ దేవతైన శీతలయంత్రం (బొడ్డు రాయి) పునః ప్రతిష్టా కార్యక్రమం గురువారం పండితుల వేదమంత్రాల నడుమ శాస్త్రయుక్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి (మచిలీపట్నం) పర్యవేక్షణలో ఆయన శిష్య బృందం ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమాన్ని పసుమర్తి నారాయణమూర్తి దంపతులు నిర్వహించారు. ఉదయం 11 గంటల 59 నిమిషాలకు శీతల యంత్ర ప్రతిష్ఠ అనంతరం బొడ్డురాయిని నిలబెట్టారు. ఆనంతరం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదం వితరణ, అన్న సమారాధన నిర్వహించారు.

● గంగానమ్మ గుడి జాతర ప్రారంభం

కైకలూరు: గంగానమ్మ జాతర మహోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కైకలూరు బైపాస్ రోడ్డులో గంగానమ్మ గుడి వద్ద జాతర ఉత్సవాన్ని ఆయన గురువారం ప్రారంభించి, పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రతి ఏటా అమ్మవారి జాతర క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఆలయ నిర్వాహకులు తులసి పూర్ణ మాట్లాడుతూ గురువారం నుంచి 17వ తేదీ వరకు అమ్మవారి గ్రామ జాతర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ కేవీఎస్ఎం.నాయుడు, చేపల రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకట్రామరాజు, కూటమి నేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● వైభవంగా పవిత్రోత్సవాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం- చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఏడాది పొడవునా జరిగే కార్యక్రమాల్లో ఏవైనా దోషాలు జరిగితే పరిహారార్థం ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు వేదికపైకి తీసుకువచ్చారు. సుప్రభాతసేవ, నాదస్వరం, గోపూజ, వేదపారాయణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన,అంకురార్పణ నిర్వహించారు. తొలుత సహాయకమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి పూజలు చేసి ఈ ఉత్సవాలను ప్రారంభించారు.

● చైర్మన్లతోనే పతాకావిష్కరణలు

ముదినేపల్లి రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లు మాత్రమే పతాకావిష్కరణలు చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు. చైర్మన్లు లేదా కమిటీ సభ్యులు అందుబాటులో లేని పక్షంలో ప్రధానోపాధ్యాయులు పతాకావిష్కరణ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

● మద్యం దుకాణాల సీజ్

కైకలూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి 10 గంటల నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు మద్యం దుకాణాలను సీజ్ చేస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది చెప్పారు. నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల్లో 22 దుకాణాలు ఉన్నాయన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జాతీయ పతాకాలు అందజేత



గుడివాడ టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం గుడివాడ ఆధ్వర్యంలో రెండు మున్సిపల్ ప్రైమరీ పాఠశాలల విద్యార్థులకు జాతీయ పతాకాలు అందజేశారు. సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు జాతీయ పతాకాలు, బ్యాడ్జ్‌లు అందజేశారు. హెచ్‌ఎంలు అరవింద్, బి.నాగరాజేశ్వరి, సేవాసంఘం సభ్యులు కె.సతీష్ కుమార్, ఉపాధ్యాయులు డి.జోత్స్న, కేఎస్ఆర్ సౌజన్య, తహీరున్నీసా పాల్గొన్నారు.